క్లుప్తంగా

మాదక ద్రవ్యాల వినియోగం ఎంతో ప్రమాదం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాదకద్రవ్యాలను తీసుకోవటం నిప్పుతో చెలగాటమాడటమేనని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పాత బస్తీలోని మహ్మదాలీపురం నగర పాలక సంస్థ హైస్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే ప్రమాదాల గురించి అవగాహన సదస్సు సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖరబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం అనేది చాలా ప్రమాదమన్నారు. మత్తు పదార్థాలు సేవించినా, కలిగి ఉన్నా రెండూ నేరమేనని చెప్పారు. మాదకద్రవ్యాలు వినియోగం వలన శారీరకంగా, మానసికంగా, సామాజిక పరంగా, ఆర్థికపరంగా నష్టపోతారన్నారు. మత్తు పదార్థాలు పీల్చేవారి మానసిక స్థితి క్రమేణా అధ్వానమవుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు బీవీ నగరాజకుమారి, ఉపాధ్యాయులు ఈ వెంకటరెడ్డి, నగజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ మమత తదితరులు పాల్గొన్నారు.

ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి ఆధారిత ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కళాశాలలోని స్కిల్ హబ్‌లో నూతన కోర్సును ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఇంటర్ డిప్లమో, డిగ్రీ పూర్తిచేసిన వారు కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఈ నెల 10వ తేదీన ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించి కోర్సును ప్రారంభిస్తామన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

నేడు విజయ ఫార్మసీలో మహిళా లీగ్-2023 పోటీలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో మహిళా లీగ్ -2023 పోటీలు ఫైనల్స్‌ను (మహిళ అధ్యాపకులకు) మంగళవారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ఏపీటీవ ఉమెన్స్ ఫోరం కన్వీనర్ కె.పద్మలత తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 130 కళాశాలల నుంచి మహిళా అధ్యాపకులు పాల్గొంటారని వివరించారు. టీచింగ్, సైంటిఫిక్, కల్చరల్ విభాగాల్లో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 8 జోన్లలో జోనల్ లెవల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జోనల్ లెవల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా అధ్యాపకులకు మంగళవారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

భక్తులకు 2 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల వేడుకలకు అంతా సిద్ధమైంది. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు రోజుల ఉత్సవాలకు సంబంధించి భక్తులకు 2 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు. అవసరమైతే అప్పటికప్పుడు ప్రసాదాలు తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు రాత్రి సమయంలో ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల విజయానికి అందరూ సహకరించాలని కోరారు.

నేడు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమి నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి పౌర్ణమికి అమ్మవారికి స్వర్ణకవచాన్ని అలంకరిస్తారు. దసరా ఉత్సవాలలో తొలి రోజున జరిగే విశేష అలంకారం, పౌర్ణమి రోజున జరుగుతుంది.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఇబ్రహీంపట్నం: పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న ఓ జంట ఇబ్రహీంపట్నం పోలీసులను సోమవారం ఆశ్రయించింది. స్థానిక ఫెర్రీ గ్రామానికి చెందిన వీరాంజనేయులు విజయవాడ రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ యువతితో ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారడంతో వివాహానికి ఇరు కుటుంబాల పెద్దలు అడ్డు చెప్పారు. స్థానిక జూపూడి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రేమవివాహం చేసుకున్నారు. రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా తరగతులు

- పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ
- ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న అధికారులు
- జిల్లాలో పరీక్షలకు హాజరుకానున్న 30 వేల మంది విద్యార్థులు



కొత్తపేట హిందూ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న ఎన్టీఆర్ జిల్లా విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవి. హైస్కూల్ పూర్తి చేసుకొని, వివిధ రంగాలను ఎంచుకొని ఇంటర్మీడియట్‌లో చేరేందుకు పదో తరగతి చాలా ముఖ్యమైన పరీక్ష కావటంతో అధికారులు, ఉపాధ్యాయులు చాలా శ్రద్ధ చూపుతూ చర్యలు చేపడుతున్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మరింత సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు ప్రభుత్వ విద్యాశాఖ నూతన టైంటేబుల్‌ను రూపొందించింది. దాని ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సబ్జెక్ట్‌ల వారీగా నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధనా తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌తో పాటుగా వివిధ ఉపాధ్యాయ సంఘాల రూపొందించిన మెటీరియల్‌తో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

జిల్లా నుంచి హాజరుకానున్న 30 వేల మంది

ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 450 విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. సుమారు 220 వరకూ జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉండగా, సుమారు 50 వరకూ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే విద్యాసంస్థలు ఉన్నాయి. అలాగే మిగిలినవి ఎయిడెడ్, ప్రైవేట్ యజమాన్యాల పరిధిలో ఉన్నాయి. వీటి నుంచి త్వరలో జరిగే పరీక్షకు 30 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నెల తొమ్మిది నుంచి 17వ తేదీ వరకూ ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతుండగా, ఏప్రిల్ మూడో తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రధానంగా విద్యార్థులను ఇటీవల వరకూ జరిగిన పరీక్షల ఆధారంగా గ్రేడ్‌ల వారీగా విభజించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌తో వారు ఉత్తీర్ణులయ్యే విధంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యాశాఖ అధికారులు సైతం పర్యవేక్షణ చేస్తున్నారు.

స్టడీ మెటీరియల్ బాగుంది



అధికారులిచ్చిన స్టడీ మెటీరియల్ చాలా బాగుంది. స్టడీ మెటీరియల్ ద్వారా చాలా అంశాలపై పట్టు సాధించేందుకు వీలుగా ఉంది. ఉపాధ్యాయులు సైతం మా పట్ల చాలా శ్రద్ధ చూపించి తీర్చిదిద్దుతున్నారు. కె.అక్షయ

మంచి మార్కులే లక్ష్యం



మంచి మార్కులే లక్ష్యంగా చదువుతున్నాము. ఏడాది మొత్తం చదివిన చదువుతో మంచి మార్కులు సాధించాలని నిర్ణయించుకున్నాను. దానికి తోడు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న తరగతులు చాలా ఉపకరిస్తున్నాయి. అశోక్‌కుమార్

సాయంత్రం వరకూ తరగతులు



మా పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. మోడల్ ప్రశ్నాపత్రాలతో పరీక్షకు హాజరయ్యే విధంగానే వివిధ టెస్ట్‌లు నిర్వహించి లోటుపాట్లను గుర్తిస్తున్నారు. దాంతో మాకు చాలా నమ్మకం పెరిగింది. విజయశ్రీ

అమ్మవారి భక్తులకు సేవలు అందించండి

కలెక్టర్ ఢిల్లీరావు



జిల్లా కలెక్టర్‌కు అమ్మవారి చిత్రం పటం అందజేస్తున్న దుర్గగుడి పాలక మండలి సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తుల మనోభావాలకు అనుగుణంగా సేవలందించి ఆలయ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆలయ పాలక మండలి సభ్యులకు సూచించారు. నూతన పాలక మండలి సభ్యులు సోమవారం కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో రెండో స్థానంలో ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఎంతో విశిష్టతను సంతరించుకుందని చెప్పారు. ఆలయ దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో నూతన పాలక మండలి సభ్యులను నియమించారని పేర్కొన్నారు. పాలక మండలి సభ్యులు సమన్వయంతో పని చేసి ఆలయ అభివృద్ధికి, భక్తుల మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి పాలక మండలి తీసుకునే నిర్ణయాలకు జిల్లా యంత్రాంగం పక్షాన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. భక్తులకు త్వరగా దర్శన భాగ్యం కల్పించేలా కృషి చేయాలన్నారు. పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు కేసరి నాగమణి, కట్టా సాంబయ్య, బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, అనుమోలు ఉదయ లక్ష్మి ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో పేట విద్యార్థిని ప్రతిభ



తిరుపతమ్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: 10 వ అంతర్ కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల విద్యార్థి ఎం.తిరుపతమ్మ రెండు బంగారు పతకాలను సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.అంకయ్య, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం క్రీడా వికాస కేంద్రంలో నిర్వహించిన 10 వ అంతర్ కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఎక్విప్‌డ్, అన్ ఎక్విప్‌డ్ విభాగం జూనియర్, సీనియర్ విభాగంలో 57 కేజీల కేటగిరిలో తిరుపతమ్మ రెండు గోల్డ్ మెడల్స్ సాధించి, జూనియర్, సీనియర్ విభాగంలో స్ట్రాంగ్ ఉమెన్‌గా నిలిచిందన్నారు. ఆమెకు కోచ్‌గా గంటా వెంకటేశ్వర్లు వ్యవహరించారని తెలిపారు. కళాశాల సెక్రటరీ కె.సాయి బాబు, ఏవో కె.సత్యనారాయణరావు, పీడీ.జి.రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ రాజారామ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, 5వ ముఖ్య మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.రాజారామ్ సూచించారు. ముత్యాలంపాడు అజయ్ హైస్కూల్లో సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళల కోసం ఉన్న చట్టాలు వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. మారుతున్న కాలానుగుణంగా మహిళల కోసం ఎన్నో చట్టాలను చేసిందని వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి మహిళ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్యానల్ న్యాయవాది పగిడిపల్లి రాము, పాఠశాల ప్రిన్సిపాల్ ఏపుగంటి లక్ష్మీఅపర్ణ మాట్లాడారు. కెఎస్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీలో పోలీసుల తనిఖీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో సోమవారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వెస్ట్ ఏసీపీ హనుమంతరావు పర్యవేక్షణలో కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, పలువురు ఎస్ఐలు తనిఖీల్లో పాల్గొన్నారు. కాలనీలోకి ప్రవేశించి మెయిన్ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. పలు బ్లాక్‌లకు చేరుకుని ఆయా బ్లాక్‌లలో నివసించే వారి వివరాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరి ఆధార్ కార్డుతో పాటు వారు ఆయా ప్లాట్‌లో ఎన్ని నెలలుగా అద్దెకు ఉంటున్నారని ఆరా తీశారు. బ్లాకుల మధ్య ఖాళీ స్థలాల్లో ఆకతాయిల ఆగడాలపై పలువురు మహిళలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలోని గ్రౌండ్, బుడమేరు కాల్వతో పాటు స్కూల్ గ్రౌండ్ వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

మర్లపాలెం వద్ద రైల్వే ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం



మర్లపాలెం వద్ద పిల్లర్లపై ఏర్పాటు చేస్తున్న గడ్డర్లు

గన్నవరం: మండలంలోని చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో కీలకమైన మర్లపాలెం వద్ద రైల్వే ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. హౌరా-చెన్నై రైల్వే మార్గంపై ఫ్లైఓవర్ నిర్మాణం కోసం గతంలోనే రైల్వేట్రాక్‌కు ఇరువైపులా పిల్లర్ల నిర్మాణం చేశారు. ఈ పిల్లర్లపై ఐరన్ గడ్డర్ల ఏర్పాటు ద్వారా రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కిలోమీటర్ల పొడవునా ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 75 శాతం బైపాస్ నిర్మాణం పూర్తి కాగా, కీలకమైన మర్లపాలెం, గొల్లపూడి సమీపంలో రైల్వేట్రాక్‌లపై ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రారంభించింది. విద్యుద్దీకరణ కలిగిన ఈ ట్రాక్‌పై ఫ్లైఓవర్ల నిర్మాణానికి రైల్వేశాఖ నుంచి అనుమతులు రావడంతో పనులను వేగవంతం చేస్తున్నారు. మర్లపాలెం రైల్వేట్రాక్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ట్రాక్‌కు ఇరువైపులా రెండు వరుసలుగా నాలుగు పిల్లర్లను నిర్మించారు. ప్రస్తుతం ఈ పిల్లర్లపై భారీ క్రేనులతో ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ గడ్డర్ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేసి రోడ్డు నిర్మాణం చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ, రైల్వే శాఖ అధికారులు, మెగా ఇంజనీరింగ్ సంస్థ సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి తాగిన వ్యక్తులు



మైలవరం: మైలవరం శివారులోని ఒక రియల్ ఎస్టేట్ లే-అవుట్‌లో గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మైలవరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ ఎల్.రమేష్ మాట్లాడుతూ సీపీ క్రాంతి రాణా టాటా ఆదేశాలతో మైలవరం డివిజన్ ఏసీపీ మారగాని రమేష్ సూచనలతో గత రాత్రి రియల్ ఎస్టేట్ లే-అవుట్‌లో గంజాయి తాగుతున్న మైలవరానికి చెందిన రాజేష్, సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద అమ్మకానికి ఉంచిన 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. ఏసీపీ ఎం.రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్లు తెలిస్తే వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామన్నారు. యువత భవిష్యత్‌ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మహిళలను సత్కరిస్తున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

విజయవాడ కల్చరల్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం మహిళా దినోత్సవం, వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన మహిళలకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణ మూర్తి మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదగటానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్, జ్యోతిష్య శాస్త్ర వేత్త ప్రసూనా రామన్ పాల్గొన్నారు. భారత మహిళామండలి విజయవాడ శాఖకు చెందిన అధ్యక్షురాలు వేమూరి ఉమా శ్రీనివాస్, కార్యదర్శి తాడువాయి శశిరేఖ, కమిటీ సభ్యురాలు రుత్తల శ్రీ లక్ష్మీదేవిని మల్లాది విష్ణు చేతులమీదుగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు క్లాసికల్ గీతాలను ఆలపించారు.

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు నేర్పాలి

ఏపీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్పొరేటర్ మాధురి లావణ్య. చిత్రంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థి దశ నుంచే పిల్లలకు నైతిక విలువలను నేర్పించాలని, తద్వారా సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఏపీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీ గౌతమ్ విద్యా సంస్థల రజతోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం కబేళా సెంటర్ బ్రాంచిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ 25 ఏళ్ల సుదీర్ఘ కాలంలో శ్రీ గౌతమ్ విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అందుకోవడం వారి చక్కటి విద్యా బోధనకు నిదర్శనమన్నారు. అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యను అందించడం శ్రీ గౌతమ్ సొంతమని పేర్కొన్నారు. కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య మాట్లాడారు.

ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందచేశారు. శ్రీ గౌతమ్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్.సూర్యారావు అధ్యక్షత వహించిన ఈ వేడుకలను స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పి.తులసి పర్యవేక్షించారు. గొల్లపూడి ఎంపీటీసీ ఎన్.దుర్గారావు, టీఎస్ పట్నాయక్, నాగరాజు, స్కూల్ ఇన్‌చార్జ్‌లు శ్రీరామ్, యమున, రేష్మా, ఉమ, మధులత, రమ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాఖ సమ్మిట్ విజయం చారిత్రాత్మకం



నరహరశెట్టి శ్రీహరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయం చారిత్రాత్మకమైనదని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, దేశంలోనే అతి పెద్ద పరిశ్రమాధినేతలు విశాఖపట్నం తరలిరావటం చరిత్రలో నిలిచిపోయే విజయమని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనటువంటి రీతిలో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, ఆరు లక్షల మందికి ఉపాధి అవకాశాలు త్వరలోనే రాష్ట్రంలోకి రానున్నాయని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరపతి, నమ్మకానికి ఈ విజయం నిదర్శనం అని తెలిపారు. ప్రతి పారిశ్రామికవేత్త జగన్‌మోహన్‌రెడ్డి సామర్థ్యాన్ని, పరిపాలన తీరును గొప్పగా కొనియాడారని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని విమర్శిస్తున్న ప్రతిపక్షాలకు ఇది మింగుడుపడక అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

స్పందన సమస్యలు పెండింగ్ ఉంచొద్దు

మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి వస్తే వాటిని పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 24 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగంపై -9, ఇంజినీరింగ్ -3, యు.సి.డి-3, పబ్లిక్ హెల్త్ విభాగం -6, రెవెన్యూ-2, జాయింట్ డైరెక్టర్ (అమృత్) -1 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ద్వారా కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో ఎలాంటి అవాంతరాలు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలు, పరిష్కరించిన వాటి వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అధనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సాధికారత విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



శ్రీనివాసకుమార్‌ను అభినందిస్తున్న నరేంద్ర రాఘవ, వెంకన్న తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, వైజాగ్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడమే అందుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల శ్రీనివాసకుమార్ అన్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఇటీవల ఆయన పార్టీలో చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని భవానీపురం లారీ స్టాండ్‌లోని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం సత్కరించి అభినందించారు. 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, పార్టీ నాయకులు ఏలూరు వెంకన్న, బొమ్ము మధు, డీపీ రెడ్డి, న్యూ లారీ స్టాండ్ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట బాబు, రఫీ, ప్రతాప్, సత్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మారుతీ వ్యాయామశాల నల్రావారివీధిలోని షిరిడీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కాకడ హారతితో వేడుకలు ప్రారంభమయ్యాయి. 6 గంటలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, 8 గంటలకు స్వామివారికి సహస్ర గులాబీపూజ చేశారు. లోక కళ్యాణార్థం లక్ష్మీగణపతి సాయిమూల మంత్రహోమం, దత్త హోమం, నవగ్రహ హోమం, నక్షత్రహోమంలను వేదపండితులు నిర్వహించారు. సుమారు రెండువేల మంది భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ట్రస్టీ ఎం.దుర్గాప్రసాద రామ కోటేశ్వరరావు శర్మ, ఎం.ప్రశాంత్ విశ్వనాథ్ శర్మ, అర్చక స్వామి రఘురామ్ పర్యవేక్షించారు.

గాయపడ్డ మహిళ మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై కంకిపాడు పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు... ఈ నెల నాలుగో తేదీన విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన మాలపాటి సీతమ్మ (47) పాయకాపురానికి చెందిన గొట్టిపాటి దుర్గాప్రసాద్ ద్విచక్రవాహనంపై నెప్పల్లి గ్రామం నుంచి విజయవాడ వైపు వెళ్తున్నారు. వారి వాహనం గోసాల సెంటరుకు చేరుతున్న క్రమంలో కంకిపాడు నుంచి విజయవాడ వైపు వస్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై నుంచి సీతమ్మ, దుర్గాప్రసాద్ కిందపడ్డారు. సీతమ్మ తలకు బలమైన గాయాలుకావడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

పెనమలూరు: కోడిపందేలు ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. పెదపులిపాక గ్రామ పరిధిని ప్లాట్‌లలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేసి, వారి వద్ద 9 బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్‌లు, రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.2700 స్వాధీనం చేసుకున్నారు.